పర్యావరణహిత జీవన విధానంపై అవగాహన కల్పించాలి

-వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : పర్యావరణహిత జీవన విధానంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా..శుక్రవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్) కార్యక్రమంపై రెవెన్యూ, కాలుష్యం, మునిసిపల్, కార్మిక, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గ్లాస్గోలో జరిగిన కాప్-26 సదస్సు సందర్భంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్)ను ప్రవేశపెట్టారని..ఈ మిషన్‌ను విజయవంతంగా అమలుచేసేందుకు వివిధ శాఖలు సమన్వయంతో, ప్రణాళికాయుతంగా కృషిచేయాలని సూచించారు. పర్యావరణ స్పృహతో కూడిన జీవనశైలిని ప్రజలు అవలంబించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని..ఈ అంశంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఈ మిషన్‌ను విజయవంతంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ డీఆర్వో కె శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, ఐసీడీఎస్ పీడీ కె. ప్రవీణ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎన్. అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'వికాస' కార్యాలయంలో 15న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ & బిటెక్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.10,000 నుండి రూ. 25,000 వరకు జీతం + ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 15వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్: 7799376333 సంప్రదించవలెను.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

విశాలాంధ్ర - జగ్గంపేట : అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లోనూ, రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోనూ నిర్వహించారు. జగ్గంపేట మండలం రాజపుడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపిపి అధ్యక్షులు అత్తులూరి నాగబాబు, వైయస్ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో నర్సులకు స్వీట్లు పంపిణీ చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు దేవర రాజు, వైసీపీ నాయకులు గొల్లపల్లి శ్రీను, చెరుకూరి జయరాజ్, ఆకుల శ్రీధర్, నీలపల్లి అప్పారావు, కిలపర్తి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలంలోని అయినాపురం శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విగ్నేశ్వర పూజ, పంచగవ్యం, దీక్ష ధారణ, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 13న వాస్తు పూజ క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, హోమాలు, 14న ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర స్థాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ వారు తెలిపారు.

వేసవి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా గ్రంథాలయ సంస్థ తూర్పుగోదావరి కేంద్ర గ్రంథాలయం కాకినాడలో వేసవి విజ్ఞానం శిక్షణ తరగతులు విద్యార్థులకు సిబ్బంది జి. దుర్గా ప్రసాద్ "నీతి కథలు" బోధించారు. ఆదిత్య కాలేజ్ లెక్చరర్ రమేష్ విద్యార్థినీ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బి. సూర్యనారాయణ విద్యార్థిని, విద్యార్థులకు ఓరిగామి పేపర్ బొమ్మలు చేయుట, ఇంగ్లీష్ గుడ్ హ్యాండ్ రైటింగ్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వి ప్రసాద్, డిప్యూటీ లైబ్రేరియన్ ఇన్‌ఛార్జ్ ఆర్ వెంకటరాము, సిబ్బంది, దోకిబుర్ర రవి కుమార్, జి దుర్గాప్రసాద్, అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలో వెలిసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం. ఈ ఆలయానికి ఒక విశిష్టత కలిగి ఉంది. ముందు పురుషుని రూపం వెనక స్త్రీ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. హైదరాబాద్ వాస్తవ్యులు మల్యాల వెంకట మహదేవకుమార్ రేణుక చిరంజీవి కార్తీక్ ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ మరియు గోపాల స్వామిదర్శించుకొని దేవాలయ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.10,116 విరాళం సమర్పించారు. దాతను శ్రీ స్వామి వారి ఫొటో, చరిత్ర పుస్తకం, శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కృష్ణ చైతన్య తెలిపారు.

రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - రంగంపేట : అకాల వర్షాలతో తడిసిన, దెబ్బతిన్న వరి పంట మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఎకరాకు రూ.25 వేలు నష్టపరహారం చెల్లించాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లమిల్లి మాట్లాడుతూ ఏప్రియల్ నెలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఉంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు కాదని అన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి

విశాలాంధ్ర - రంగంపేట : విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదువుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని లైబ్రేరియన్ ఎన్. రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి కోటేశ్వరరావు ప్రసంగించారు.అనంతరం విద్యార్థులు బాలల గేయాలు ఆలపించారు.

వెంకటపతి రాజు మృతి పట్ల సంతాపం

విశాలాంధ్ర - రంగంపేట : రంగాపురానికి చెందిన వైసిపి నేత కనుమూరి వెంకటపతి రాజు (65) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన రాజు మృతి పట్ల ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, పార్టీ మండల ఇంచార్జ్ నల్లమిల్లి మురళి బాలకృష్ణారెడ్డి, ఏఎంసి చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కనుమూరి సాయిరాజు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

విశాలాంధ్ర - కొవ్వూరు :కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి కుమరదేవం గ్రామంలో గల గోదావరి నదిలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం కొట్టుకుని వచ్చింది. మృతదేహం పొడవు సుమారు 5 అడుగులు, చామన చాయ, వయస్సు సుమారు 28- 32 సంవత్సరాలు ఉంటుంది. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే సంప్రదించవలసిందిగా కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు.

నాడు నేడు పనులను జూన్ 12 నాటికి పూర్తి చేయాలి

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో మన బడి-నాడు నేడు కింద చేపట్టిన రెండో దశ పనులను జూన్ 12 నాటికి పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా..పాఠశాల విద్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులతో కలిసి మండల విద్య, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి సెలవులతో పాటు నిర్మాణాలకు అనువైన వాతావరణం ఉన్నందున నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మరుగుదొడ్లు, విద్యుదీకరణ, తాగునీరు తదితర పది రకాల పనులను పూర్తిచేయాలని..ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో నాడు నేడు రెండో దశ కింద సుమారు 882 అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. పనుల పురోగతిపై మండల స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవోలు, ఎంఈవోలు ప్రాధాన్య పనులపై దృష్టిసారించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులను శతశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను ప్రణాళికాయుతంగా పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో అయిదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ సీడింగ్, ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్), ఇంటర్ విద్యార్థులకు రెమెడియల్ తరగతులు తదితర అంశాలపైనా చర్చించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎం శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ కె. ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నాన్ స్టాప్ బస్సులకు మహిపాల చెరువు సెంటర్లో రిక్వెస్ట్ స్టాప్ ఇవ్వాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాకినాడ, అమలాపురం ఆర్టీసీ నాన్ స్టాప్ బస్సులకు మహిపాల చెరువు సెంటర్లో రిక్వెస్ట్ స్టాప్ మంజూరు చేయాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ఈ రూటులో ముమ్మిడివరం కేంద్రంగా రిక్వెస్ట్ స్టాపు ఉన్నా ఇటీవల కాలంలో బైపాస్ రోడ్డు నిర్మాణంతో నాన్ స్టాప్ బస్సులు మున్సిపాలిటీ పరిధి లోకి రాకుండా బైపాస్ రోడ్డు మీదుగా వెళ్ళిపోతున్నాయి. కొండాలమ్మ చింతకు దూరంగా బైపాస్‌లో బస్సులు ఆగినా ముమ్మిడివరం వాసులకు నిరుపయోగంగా ఉంది. దూరాభారం పెరగడంతో గ్రామంలోకి నడిచి వెళ్లలేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. బైపాస్ రోడ్డులో చీకట్లో దిగే ప్రయాణికులకు సౌకర్యాలు లేవు. ఇక్కడ రిక్వెస్ట్ స్టాప్ ఉంటే చాలామంది ప్రయాణికులు ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో దిగకుండా మహిపాల చెరువు, అమలాపురం చేరుకుంటున్నారు. మహిపాల్ చెరువు సెంటర్లో కాకినాడ నుంచి వచ్చే అమలాపురం నాన్ స్టాప్ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్ ఇస్తే ఇటు ముమ్మిడివరం, అటు కాట్రేనికోన, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. సముద్ర తీరంలోని మత్స్యకార గ్రామాల ప్రజలకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుంది. ఈ మండలాల ప్రజలు కాకినాడ నుండి అమలాపురం ఎర్ర వంతెన వరకు వెళ్లి మళ్లీ వెనుతిరిగి ఆటోలు, ఇతర వాహనాలపై అనేక కష్ట నష్టాలు పడిప్రయాణిస్తూ తమ గ్రామాలకు చేరుకుంటున్నారు. నాన్ స్టాప్ ఎక్కితే సమయం కలిసి వస్తుంది అనుకున్నా ఈ మండలాలు ప్రయాణికులకు నిరాశే ఎదురవుతోంది. అనుమతి లేదంటూ మహిపాల చెరువు సెంటర్లో నాన్ స్టాప్ బస్సు డ్రైవర్లు ఎంత బ్రతిమాలినా బస్సులు ఆపడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో వృద్ధులు, మహిళలతో పాటు రోగులు కూడా అనేక ఇక్కట్లు పడుతున్నారు. ప్రతిరోజు వైద్య నిమిత్తం కాకినాడ కేంద్రానికి స్థానికంగా చాలామంది బస్సులు పైనే రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అందరికీ అసౌకర్యంగా ఉంటోంది. ఇకనైనా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు ప్రజా సౌకర్యం దృష్ట్యా మహిపాల చెరువు సెంటర్లో కాకినాడ-అమలాపురం వెళ్లే నాన్ స్టాప్ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్ మంజూరు చేసేలా కృషి చేయాలని నాలుగు మండలాల ప్రజలు కోరుతున్నారు.

విద్యా సంస్కరణలతోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు స్టేట్ ఫస్ట్

విశాలాంధ్ర - జగ్గంపేట: జగనన్న తీసుకువచ్చిన విద్యా సంస్కరణలతోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు స్టేట్ ఫస్ట్ సాధించారని వైసీపీ నేత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఒమ్మి రఘురామ్ అన్నారు. పదవ తరగతి పరీక్షలలో రాజపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు చక్కటి ప్రతిభ కనపరిచడంతో వారిని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వారి స్వగృహంలో సత్కరించారు. అనంతరం రాజాపూడి హైస్కూల్లో రఘురామ్ ఎంపిపి, అత్తులూరి నాగబాబు, సర్పంచ్ బుసాల విష్ణుమూర్తితో కలసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్టేట్ ఫస్ట్ రావడం ఇదే మొదటిసారి అన్నారు. గత ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తే జగనన్న పేదల పక్షం నిలిచి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు బంగారు భవిష్యత్తు అందిస్తుందన్నారు. విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దేవర రాజు, తెనుకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరు నాని, వైసీపీ నాయకులు జామి పెద్ద కాపు, గొల్లపల్లి శ్రీను, చెరుకూరి జయరాజ్, ఆకుల శ్రీధర్, వైసీపీ నాయకులు నీలపల్లి అప్పారావు, కిలపర్తి వీరబాబు స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 1 రద్దు ప్రభుత్వానికి చెంపపెట్టు

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రతిపక్షాల గొంతు నొక్కేలా వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ ఒకటిని హైకోర్టు కొట్టి వేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానంద రావు అన్నారు. శుక్రవారం రావులపాలెం టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ ఒకటి విషయంలో ప్రజలు, ప్రతిపక్షాల భయాందోళనలు నిజమే అని రుజువు చేసేలా కోర్టు తీర్పు రావడం హర్షణీయమని అన్నారు. ఇరుకు రోడ్లలో సభలు, రోడ్ షోలు నియంత్రించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ ఒకటి ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉందని, కోర్టు కూడా ఇదే అభిప్రాయంతో జీవోను కొట్టివేసిందని అన్నారు. అప్రజాస్వామికంగా, నిరంకుశ వైఖరితో జారీచేసిన పలు జీవోలను కోర్టులు కొట్టివేస్తున్నా చలించని ప్రభుత్వం ఇదేనని ఆయన ఎద్దేవా చేసారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, జక్కంపూడి వెంకటస్వామి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, కరుటూరి నరసింహారావు, ముదునూరి వెంకటరాజు, పడాల బులి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సులకు సత్కారం

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక గాంధీనగర్ ఒంటిమామిడి జంక్షన్ అశ్విని హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు అలై కిరణ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా అలయన్స్ క్లబ్స్ వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చప్పిడి మాట్లాడుతూ ఎలాంటి మనిషికైనా అనారోగ్యం ఏర్పడినప్పుడు వారు ఏ పరిస్థితుల్లో ఉన్నా సరే వారికి సేవలు చేసి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేది నర్సులే అన్నారు. ఈ సందర్భంగా కాకినాడ, విజయవాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్లో హెడ్ నరులు బొక్క వెంకటలక్ష్మి, మారెమ్మ, కదలి బేబీ సరోజినీదేవి, లక్ష్మీ, శశికళలకు డాక్టర్ చప్పిడి, క్లబ్ సభ్యులు పాదపూజ చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిసిటి అలై సతీష్, జెడ్‌సిఎం. దుర్గాసముద్ర, క్లబ్ కోశాధికారి అలై కొత్త శ్రీరాములు, క్లబ్ పిఆర్ఓ అలై బాలా త్రిపుర సుందరి, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు

విశాలాంధ్ర - కాకినాడ : భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరిస్తూ జనవరి 1వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం-1ను కోర్టు కొట్టివేయడం జగన్ మోహన్‌రెడ్డికి చెంపపెట్టు అని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు దురుద్దేశంతో జగన్మోహనరెడ్డి ఈ జీవోను విడుదల చేశారని అన్నారు. జీవో విడుదలైన నాటి నుండి సిపిఐ, రాష్ట్రంలో ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య వాదులు పెద్ద ఎత్తున ఉద్యమించారని అన్నారు. జీవో రద్దుకు స్పందించని జగన్మోహనరెడ్డికి హైకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

డివైఈఓ ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర - సీతానగరం : డివైఈఓ తిరుమల దాస్ ఆకస్మిక పర్యటన చేశారు. మండలంలో సీతానగరం గ్రామంలో గల పువ్వాడ అచ్చమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డివైఈఓ తిరుమల దాస్ ఆకస్మికంగా పర్యటించి జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు అందించనున్న షూలు, దుస్తులు, పుస్తకాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి తప్పిన విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. నాడు నేడు పనుల పురోగతిని పరిశీలించి మండల విద్యాధికారి స్వామి నాయక్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ పుష్పలత, గణిత ఉపాధ్యాయుడు సతీష్ బాబు, సిఆర్‌పిలు, విద్యార్థులు పాల్గొన్నారు. దిలీప్, డాక్టర్ కె. హేమావిజిత, ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని మిల్లులను సీజ్ చేస్తాం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం : ధాన్యం దిగుమతులలో ప్రభుత్వనిబంధనలు పాటించని మిల్లులను సీజ్ చేస్తామని నిడదవోలు తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. శెట్టిపేట ఆర్బీకే పరిధి నుండి తరలించిన ధాన్యాన్ని మిల్లరు దిగుమతి చేసుకోవడానికి నిరాకరించారంటూ వచ్చిన ఫిర్యాదును పరిష్కరించేందుకు తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలమేరకు నిడదవోలు మండలం రావిమెట్ల గ్రామంలో గల శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఫుడ్ ప్రాసెసింగ్ రైస్ మిల్లును శుక్రవారం తహశీల్దార్ గంగరాజు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు చేసేది ప్రభుత్వం అని,డబ్బులు చెల్లించేది ప్రభుత్వమేనని, ధాన్యం నాణ్యత తో మిల్లులకు సంబంధం లేదన్నారు. నూక శాతం ఎక్కువ ఉందని,రంగు మారిందని, మరే ఇతర కారణాలచేతనైన రైతుల నుండి డబ్బులు డిమాండ్ చేసిన మిల్లులను సీజ్ చేస్తామని మిల్లర్లను హెచ్చరించారు. ఆయన వెంట గ్రామ రెవెన్యూ అధికారులు రైతులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో రైతు ఉద్యమాలను ఆపలేరు

విశాలాంధ్ర - చాగల్లు : రైతుల సమస్యలపై శుక్రవారం సీఎం కార్యాలయం ముట్టడికి వెళ్ళ వద్దంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, రైతు సంఘం మండల నాయకులు కంకటాల బుద్ధుడులను గురువారం అర్ధరాత్రి పోలీసులు గృహనిర్బంధం చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బారావు తీవ్రంగా ఖండించారు. జిల్లాలో రైతాంగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తడిచిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ఇప్పటికైనా జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముందస్తు అరెస్టులు,పోలీసు నిర్బంధాల వలన ప్రభుత్వాలపై మరింత వ్యతిరేకత వస్తుందని హెచ్చరించారు. అకాల వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. నష్టపోయిన కౌలు రైతులకే పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్య రంగానికి పెద్దపీట

విశాలాంధ్ర-దేవరపల్లి: వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు దేవరపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో గోపాలపురం నియోజకవర్గంలో గోపాలపురం దేవరపల్లి నల్లజర్ల ద్వారకా తిరుమల గ్రామాలలో ప్రభుత్వ వైద్యశాలలలో కోవిడ్ 19 స్పెషల్ బెడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఒక్కొక్క వైద్యశాలకు తొమ్మిది లక్షల 83 వేల రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో వైద్యశాలలలో మౌలిక సదుపాయాలు బెడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ నాగదేవి పాపారావు సిహెచ్ఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

విశాలాంధ్ర - కరప : రోగులకు సేవ చేయడంలో నర్సులు కీలకపాత్ర పోషిస్తారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరల్డ్ నర్సింగ్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్ పీహెచ్సీలోని నర్సింగ్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సీనియర్ సిహెచ్ఓ రత్నకుమారి, హెచ్‌విలు సత్యనారాయణమ్మ, మస్తాన్‌బి, సీనియర్ స్టాఫ్ నర్స్ లక్ష్మీ, మహాలక్ష్మి, కనకదుర్గ లను ఘనంగా సన్మానించారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

రైతులతో ఏపీ ఫుడ్ కార్పొరేషన్ కమిషనర్ సమీక్ష

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మెర్లపాలెం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో ఏపీ ఫుడ్ కార్పొరేషన్ కమిషనర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు వరి పంటపై పడే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ మాకు గోనె సంచులు ఇబ్బంది ఉందని, మిల్లర్లు ఐదు కేజీలు ధాన్యాన్ని లెస్ చేస్తున్నారని బస్తా.కి 125 రూపాయలు జట్టుకూలి కలిసి 300 నుంచి 400 దాకా ఖర్చవుతుందని తెలిపారు. అది లారీ లోడు దింపుకునే లోపులో మిల్లర్లకు ఎకౌంట్లో వేసిన లారీలనే అన్లోడ్ చేస్తున్నారంటూ రైతులు గోడు తెలుపుకున్నారు. ఏపీ ఫుడ్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఖరీదు చేస్తే బయట అమ్మండి లేదంటే ప్రభుత్వానికి అమ్మండని సూచించారు. సంచులు కొరత లేకుండా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఆయన వెంట అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్ర, ఆర్డీవో ముక్కంటి, అగ్రికల్చరల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పడా కో వైస్ చైర్మన్ రఘురామ్ పర్యటన

విశాలాంధ్ర - అమలాపురం : సరిపల్లి అల్లూరి ఆక్వా ఫామ్స్ అండ్ నర్సరీని అప్పడా కో వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ సందర్శించారు. ఆయన్ని శుక్రవారం రైతులు నాని రాజు, తృవటపల్లి, నాగభూషణం యాళ్ల వెంకటానందం ప్రసాద్ రాజు, సంసాని బులి నాని, దిలీప్ కుమార్, రమేష్ రాజు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఆక్వా రైతులు అప్రమత్తతతో ఆక్వా సాగు చేయాలని రైతులకు సూచించారు.

వికలాంగుల ఉపాధ్యక్షునిగా రామారెడ్డి

విశాలాంధ్ర - రంగంపేట : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనపర్తి మండల వికలాంగుల విభాగం ఉపాధ్యక్షు నిగా నల్లమిల్లి రామారెడ్డి (రామయ్య) నియమితులైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి తెలిపారు. రామా రెడ్డి నియామకం పట్ల రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, సత్తి గంగిరెడ్డి, సత్తి కాటవ రెడ్డి, సత్తి సత్తిరెడ్డి, సత్తి వెంకటరెడ్డి (బ్రదర్స్), పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి, సత్తి రామారెడ్డి (కొత్తూరు రాము), నల్లమిల్లి వెంకటరెడ్డి (సుమన్) హర్షం వ్యక్తం చేశారు.

గైనకాలజిస్టు లేక ప్రసూతి చేయలేమని చేతులెత్తేసిన వైద్యులు

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసూతులు జరగాలంటూ ప్రభుత్వ యంత్రాంగం కోట్ల రూపాయలకు ఖర్చు పెడుతుంటే ప్రసవానికి సంబంధించిన సి. హెచ్.సిలో ఆపరేషన్ చేసే వైద్యులు లేకపోవడంతో ఇద్దరు గర్భిణీ స్త్రీల ప్రసూతి విషయమై వైద్య సిబ్బంది మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళమని చెప్పారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళవలసిన దుస్థితి స్థానిక గోపాలపురంలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. మండలంలోని వాదాలకొండ గ్రామానికి చెందిన గర్భిణీ చమటపల్లి కుసుమాంజలి 11వ తేదీన(బుధవారం) గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పురుడు పోసుకోవడానికి చేరింది. కొవ్వూరుపాడు గ్రామానికి చెందిన గర్భిణీ మరపట్ల కళావతి అదే రోజు సాయంత్రం పురుడు పోసుకోవడానికి వచ్చింది. వీరిద్దరికీ ప్రసూతి చేసేందుకు సిహెచ్ సిలో గైనకాలజిస్టు బదిలీపై వెళ్ళిపోగా శస్త్ర చికిత్సలు చేసే వైద్యులు గతంలోనే వెళ్ళిపోయారు. ప్రసవాలకు సిద్ధపరచిన ఇద్దరి కొరకు నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సర్జన్ ను రప్పించే ప్రయత్నం చేసి చివరి దశలో నిడదవోలు ఆసుపత్రికి వెళ్ళమని స్థానిక వైద్యులు సిఫార్సు చేయడంతో సుమారు గంటసేపు గర్భిణీల కుటుంబ సభ్యులకు వైద్య సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గత్యంతరం లేక నిండు చూలాలుగా ఉన్న తమ బిడ్డలను అందుబాటులోని ప్రైవేటు ఆసుపత్రులకు ఆటోలను పురమాయించుకుని తీసుకువెళ్లారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ గర్భవతులకు సరైన వైద్యం చేయించలేక పోతున్నారంటూ దుయ్యబట్టారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

విశాలాంధ్ర - రంగంపేట : ఎంతో నమ్మకం, విశ్వాసంతో పార్టీ నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షునిగా నియమించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డికి మల్లిడి నితిన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం విశాలాంధ్రతో నితిన్ మాట్లాడుతూ పార్టీ, ఎమ్మెల్యే నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

జీవో నెం.1 రద్దుపై ఎమ్మెల్యే వేగుళ్ల హర్షం

విశాలాంధ్ర - మండపేట : రాష్ట్రంలో సభలు, రోడ్ షోలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.1ని ప్రవేశపెడితే దాన్ని హైకోర్టు తిరస్కరిస్తూ రద్దు చేయడం పట్ల మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.1ని హైకోర్ట్ కొట్టివేయడం వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా వైసీపీ ప్రభుత్వం జీవో నెం.1 తెచ్చిందన్నారు. ఇరుకు రోడ్డులో సభలు, రోడ్ షోలు నియంత్రించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.1 ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉందన్నారు. వైసీపీ నాయకులకు త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని మరలా ప్రజారంజకంగా పరిపాలించే టీడీపీ ప్రభుత్వం రావటం ఖాయమని ఎమ్మెల్యే వేగుళ్ల ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ

విశాలాంధ్ర - సామర్లకోట : తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని సామర్లకోట మండలం పెద్ద బ్రహ్మదేవం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సి. మణి కుమారి ఆధ్వ ర్యంలో మే 8వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం పాఠశాల విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదవడం, డ్రాయింగ్ తదితర అంశములపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ విమల దేవి, సునీత పాఠశాల విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.